


"అయామ్ చైతన్య"

తలెత్తి చూసారు ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లు ముగ్గురూ ఒకేసారి. నమస్కారం కాదు కదా కనీసం గ్రీట్ కూడా చేయకుండా లోపలకు సుడి గాలిలా వచ్చిన అతన్ని వింతగా చూశారు.

ఉదయం నుండి ఇంతవరకూ ఓ ముప్పై మంది వచ్చారు. ప్రతీ ఒక్కరు వినయంగా నమస్కారం చేసి ఒదిగి ఒదిగి కూర్చుని పూర్తి జవాబులు చెప్పకపోయినా బుద్ధిమంతుల్లా, బడి పిల్లల్లా ప్రవర్తించారు.

ఎదురుగా ఠీవిగా కూర్చున్నాడు చైతన్య.

ముగ్గురిలో ఇద్దరికి మాత్రం మంటగా వుంది. ఒక వ్యక్తి రామానుజం మాత్రం చైతన్యను, అతని వ్యక్తిత్వాన్ని అంచనా వేసి ఫైలు తిరగేసాడు.

ఎం.కాం. ఫస్టుక్లాస్... టైపు ఇంగ్లీషు, తెలుగు హైయర్ పాసయ్యాడు. షార్ట్‌హేండ్ వుంది. తమకు కావలసిన కేండేట్‌కు వుండవలసినవన్ని అర్హతలున్నాయి.

మిగిలిన ఇద్దరూ చూశారు.

ప్రశ్నల పరంపర కురిపించారు ముగ్గురూ.

ప్రతీ ఒక్కదానికి టకీమని చైతన్య జవాబు ఇస్తుంటే రామానుజం మెచ్చుకోలుగా చూశాడు.

"ఇంతవరకూ ఎందుకు ఉద్యోగం సంపాదించలేదు?"

"నా అర్హతలకు తగిన ఉద్యోగం వస్తుందన్న నమ్మకం"

"మరి నిరుద్యోగిగా నాలుగేళ్ళ అనుభవం"

"ఈ అనుభవం చాలా తక్కువ. ఎక్కడికెళ్ళినా లంచం, రికమెండేషను, రిజర్వేషను... ఒక్క పైసా, ఒక్క కాగితం ఇవ్వకుండా ఉద్యోగం సంపాదించాలన్న ఆశయం... చిన్న చిన్న ఉద్యోగాలు చేశాను. అక్కడ అవినీతికి ఎదురు తిరిగాను. నా నీతి నిజాయితీలకు విలువ ఇవ్వలేదు..."

"నువ్వు చూడ్డానికి విప్లవ వాదిలా కనిపిస్తున్నావే"

"కడుపుమండితే విప్లవం వస్తుంది. నా చదువు కోసం కొన్ని వేలు తగలెట్టి బాధపడుతున్న అమ్మ, నాన్నలను చూస్తుంటే విప్లవం వస్తుంది. అవినీతి పెరిగి నా ఆశయాలకు బురద చిమ్ముతుంటే విప్లవం వస్తుంది" చైతన్యలో ఆవేశం.

"ఒకే... ఇక వెళ్ళవచ్చు"

చైతన్య బయటకు వెళ్ళాక రామానుజం, "చూడండి చంద్రశేఖర్... చైతన్యలో తెలివితేటలున్నాయి... పట్టుదల వుంది. పైగా క్వాలిఫైడ్. అతన్ని సెలక్టు చేద్దాం" అన్నాడు.

పర్సనల్ మేనేజరు చంద్రశేఖర్ చిన్నగా నవ్వి "మనది ప్రైవేట్ ఇండస్ట్రీ... పని కన్నా ముందు కావలసింది డిసిప్లిన్. అంత పొగరుబోతు రేపు మన మాటలు వింటాడన్న నమ్మకం ఏముంది. ఈరోజు మనకు నమస్కారం చేయలేదు. రేపు తన విప్లవ ధోరణిలో యూనియన్ లేవదీసి మనల్ని ఇరుకున పెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదు. అణకువగా, బుద్ధిగా ఒదిగి ఒదిగి వుండేవాళ్ళు కావాలి..."

రామానుజంకు ఇంకా అర్థం కాలేదు...

"మరి అతన్ని ఎందుకు రెచ్చకొట్టారు"

"అతని క్వాలిఫికేషన్లు, తెలివితేటలు చూసినవాళ్ళెవరైనా అతనికే ఉద్యోగం రావాలంటారు. మన పై బాస్‌లు కూడా... కానీ అతను సెలక్టు కాకూడదు. అతన్ని విప్లవవాదిగా ముద్ర వేస్తే అతని క్వాలిఫికేషన్లు వెనక్కు వెళతాయి... ఇలా ఎందుకు చేసామో తెలుసా!"

అని చంద్రశేఖర్ ఓ కవరు లోంచి కాగితాలు తీసి చూపించాడు. రామానుజం కొయ్యబారిపోయాడు.

ఆల్‌రడీ ఆ పోస్టు పై రికమెండేషనుతో ఫిలప్ అయింది. అది ఓ బడా బాబుకు అపాయింట్‌మెంట్ ఆర్డరు.

ఈ బహుమతి పొందిన రచన లలో మీకు నచ్చిన మినీకథ వివరాలు దిగువ యిచ్చిన కూపన్‌లో నింపి, పోస్టుకార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

—ఎడిటర్

ఈ సంచికలో నాకు నచ్చిన మినీకథ..........................................

రచయిత/రచయిత్రి..........................................

పేజీ నంబరు: ___________________